# నల్లటిమనిషి

౧

తెనాలికి తొందరపనిమీద వెళ్ళవలసి రైలు బైలుకు కొంచెముముందుగనే స్టేషనుకు చేరాను. రైలు ఎక్కేముందు ఒక చివరనుండి ఇంకో చివరకు ప్లాటుఫారంమీద తమాషాగా పచారుచేయటం, ఏదైనా అందమైన ముఖం కనపడుతుందేమోనని చూడటం నాకూ అలవాటే చాలామందికి మల్లే.

ఒక పెట్టెలో మాత్రం ఒంటరిగా కూర్చున్న యువతి కనపించింది. ఆమెముఖం అంత అందమైనది కాదు కాని ముఖకవళికలలో ఏదో కొంతఆకర్షణమాత్రం ఉన్నది. ఆమె దేహచ్ఛాయ పసిమీగాదు. నలుపూగాదు. ఆరోకం తమాషా చామనచాయ. కేశములుమాత్రం దీర్ఘంగాను దట్టంగాను ఉన్నాయి అనుకోంటూ, ఎందుకంటే, ఆమె వేసుకొన్న బర్మాముడి గుబురుగా గోముగా పెరిగిన గులాబిపొదలాగ ఉన్నది.

ఆమె నన్ను ఆకర్షించింది. రెండుసార్లు అటునుంచి ఇటూ, ఇటునుంచి అటూ తిరిగాను. ఆమె నా వంకకు చూచినప్పుడల్లా నేను తలవంచుకొని నన్ను చూడనట్లు తోచినప్పుడల్లా ఆమెవంకచూడటం మొదలుపెట్టాను. ఇట్ల ఇంకా నాలుగుసారులు తిరిగేసరికి ఆమె ఒంటరిగా ప్రయాణంచేస్తున్నదనీ ఆమెవెంట పెద్దవాళ్ళెవ్వరూ లేరని నా కొకఊహకలిగింది. పరాయిస్త్రీసొక్క అందాన్నిచూడటానికి నాకు అదే మొదటిసారి అవకాశంకలగటం.

ఎందుచేతనంటే మా కాంతంలేకుండా ఒంటిరిగా నేనెప్పుడూ ప్రయాణంచేయలేదు. ఒంటిరిగా ఉన్నా, ఆవిడలేని రోజులలో పరకాంత, పనిచేసేమనిషైనా సరే చివరకు నాకళ్ళకు కనపడకుండా ఉండే ఏర్పాటులుచేసి వెళ్ళుతుంది కాంతం. తాను పుట్టినింటికి వెళ్ళేముందు పనిచేసేదాన్ని తీసివేసి రావద్దని కచ్చితంగా చెప్పి. పోట్లాడో పంపేస్తుంది. ఆవిడ లేనప్పుడు ఆడవాళ్ళు ఎవరూ మా ఇంటికి రాయగదా! కాలం అలా గడుస్తూఉండటంమూలాన పరకాంతల ముఖమైనా చూచే అవకాశం నాకెన్నడూ కలగక పోయినందున, ఆరోజున దొరికిన అవకాశాన్ని అపూర్వంగా అనుభవిద్దామనుకొని అట్లా ప్రవర్తించాను.

ఇంతలో రైలుగంట కొట్టారు. పచ్చజండా ఊపారు. నేనూ నాపెట్టెను ఆమనిషిఉన్న పెట్టెలోనికి చేర్చి ఎక్కాను. పెట్టెను నాప్రక్కనే పెట్టుకొని ఆవిడకు ఎదురుగాఉన్న బల్లమైన కిటికీదగ్గరగా కూర్చోటం తటస్థించింది. ఇదంతా నేను చెయ్యాలని చెయ్యలేదు ఆసమయానికి అట్లా జరిగింది.

బండి కదిలింది నేనిప్పుడు ఆస్త్రీకి ఎదురుగా ఉన్నాను. ఆబండిలో ఇంకా ఇద్దరో ముగ్గురో మనుష్యులు ఉన్నారు. అవతలబెంచీమీద ఖాళీగాఉంది కాని, నేనెందుకు లేవటం, ఆవిడకు కష్టంగాఉంటే ఆవిడే లేచిపోతుంది అని అనుకొని అక్కడేకూర్చుని కొనుక్కున్న హిందూపత్రిక చదువుకుందామని మడత విప్పాను. పేపరు ముఖానికి అడ్డంగా పెట్టుకొని చదవటం ప్రారంభించాను. వాంటెడ్ కాలమ్స్, ప్రకటనలు చదివేసరికి అవలింతవచ్చింది. ఆ సందర్భంలో పేపరు ముఖంమీదనుండి తొలగించుకొంటుంటే ఆవిడ ముఖానికి తగిలింది. ఆవిడ క్రిందకువంగి పేపరులో చివర పేజీలోనున్న విషయమేదో చదువుతున్నదని నాకేం తెలుసూ. అసలు ఇంగ్లీషువచ్చిన మనిషి అనే నేననుకోలేదు. ఆమె ముఖానికి పేపరుకొసలు తగలటం, వెంటనే ఆమెకురులు సవరించుకొంటూ, పమిట సర్దుకోటం చూచేసరికి నాకు నవ్వు వచ్చింది. అందుకని నవ్వుతూ ఎక్స్క్యూజ్ మి అన్నాను. ఆమె మాట్లాడలేదు. ఆవిడకూ నవ్వువచ్చిందికాని నేను ఏమనుకొంటానో అని కాబోలు నవ్వు ఆపుకొన్నది. కాని ఆ ఆపుకొన్న నవ్వు ముఖమంతా వ్యాపించి ఆమె చిరుపెదవులలోనుంచి కండ్లకొసలలోనుంచి తొంగిచూడటం ప్రారంభించింది.

మళ్లీ నేను పేపరుచదవాలని ప్రయత్నించాను. కాని అట్లా తొంగిచూచినవ్వు నన్ను చక్కిలిగింత పెట్టటం మొదలుపెట్టింది. కళ్లంతా ఏదో తేలిపోతున్నా చదువుతున్నది అర్థంకాకపోవటం! అదీ నాఅవస్థ. అగిలి గింత ఎంతోసేపు ఆపుకొన్నాను. కాని ఆవిడతో మాట్లాడాలనిపించింది. పరస్త్రీతో మాట్లాడటం తప్పు అనీ, మాట్లాడినంత మాత్రాన ఏతప్పూ లేదనీ రెండు ఆలోచనలో ఒకదాన్నొకటి తరుముకుంటూ వచ్చినయి. అదీకాక ఆకళ్లు, నాసలూ, ఆ కెంపు పెదవులూ నన్ను అల్లా పలకరిస్తూవుంటే నేను మాట్లాడక ఊరుకోనా?

పేపరు ఇంతవరకూ మాఇద్దరిమధ్య తెరగావుంది. దాన్నిమడిచి చేత్తోపట్టుకొని ఆవిడవంక ఒకమారు చూచి చప్పున మళ్ళీ కిటికీలోనుంచి ఆకాశంకేసి చూశాను. నాకెట్లా తెలిసిందో అట్లా చూపులను దొంగిలించాలని! నల్లనిమేఘాలు ఉన్నాయి ఒకవైపున. ఎదురుగా దిక్సతి తన కెంపు పెదవులతో అతనివైపు చూస్తున్నది. మేఘుడు ఊరుకొన్నాడా. ఆరక్తిమను గ్రహిస్తూనేఉన్నాడు. ఇంతలో ఆమె ఏంచేస్తున్నదో చూద్దామని బుద్ధిపుట్టి ఆమెవంక తిరిగిచూచాను. ఆమె ఆకాశాన్ని చూస్తున్నది.

నేను ఆమెను చూస్తున్నానని గ్రహించి ఆమె నావంక తిరిగింది. నేను నాచేతులోనున్న పేపరును ఆమెకు అందించాను. ఆమె మాట్లాడకుండా పుచ్చుకొని అటూఇటూ తిరగేసి ఏదో చదివినట్లేచదివి అయిదునిమిషాలలో మళ్ళా నాబల్లమీద పెట్టేసింది. పెదవి విప్పి ఒక్కపలుకైనా పలుకలేదు. కాని ఆకళ్ళు, నాసలు నవ్వుతునే యున్నవి.

ఇంతలో గుడివాడస్టేషను సమీపించాము. బందరు నుండి బయలుదేరినబండి ఇంత త్వరలో గుడివాడ వస్తుందనుకోలేదు. ఇంకేముంది; ఇంక కాసేపట్లో బెజవాడ వస్తుంది. అటుతరువాత ఎవరిదారి వారిదేకదా అని పించింది.

చల్లనిగాలి వీస్తున్నది. వెన్నెలరాత్రికూడాను. గాలి నాచెవులో రహస్యంగా "ఊరికే చూస్తూ కూచుంటావేం. మాట్లాడరాదా" అని చెప్పింది. ధైర్యంతో పెద్దమనిషి తరహాగానే అన్నాను. "అమ్మా మీ రెంతవరకు ప్రయాణంచేస్తారు" అని. ఆమె నవ్వుతూ "మీరో" అన్నది. నేను తెనాలి వెడుతున్నానన్నాను. "నేనూ అటువైపే వస్తా" నన్నది. ఆమాటలు వినే సరికి నాకు ఏదో దేవగానం విన్నట్లు ఉన్నదిగాని ఎదుటవున్న స్త్రీ మాట్లాడినట్లుగాలేదు. బెజవాడలో కూడ ఆమెఎక్కిన పెట్టెలోనే నేనూ ఎక్కాలని అనుకొన్నాను. అదేమిటో ఆమె సామీప్యమే నా కంత ఆనందాన్ని ఇచ్చింది. అద్వైతులు దీన్నే కాబోలు సామీప్యం అంటారు !

౨

గుడివాడలో బండి ఆగినతరువాత ఆవిడ నన్ను ఉద్దేశించి "ఇక్కడ నీళ్ళకుళాయి ఎటువైపు ఉంటుందండీ" అన్నది. ఇన్నిమాటలు ఒకేసారి వినే సరికి వెయ్యివీణెలను ఒక్కసారి మీటినట్లుంది. దూరాన ఎక్కడో పాడుతున్న మధురగానాన్ని హాయిగా వింటున్నట్లుంది. నేను, "ఇల్లా ఇవ్వండి నీరుతెచ్చి పెడతాను" అన్నాను. ఆమె చిరునవ్వుతో "మీకు శ్రమ" అన్నది. "ఫరవాలేదు ఇల్లా ఇవ్వండి" అని ఆ మరచెంబు ఆమెచేత్తోనుండి తీసుకొని నీళ్ళుండే తావుకు ఒక్కపరుగున వెళ్లాను. కుళాయిలోని నీళ్ళు పట్టానుగాని ఆనీళ్ళు వేడిగాఉన్నాయి. ఛీ ఈ వేడి నీళ్ళు ఆవిడకు ఇయ్యటం ధీరలక్షణం కాదనుకొని, ఆ చెంబుతీసుకొని రైలులో సోడాఅమ్మే పెట్టెదగ్గరకు వెళ్ళాను. స్పెన్సరు సోడాఒకటి గ్లాసులో పోయించుకొని,అందులో కొంచెం తీపికలిపించి, కొంచెం మంచు గడ్డ వేయించి పట్టుకెళ్ళాను. అయిదు అణాలు చెల్లించాను అనుకోండి. అది వేరేవిషయం

ఆమెకు సోడాఇచ్చి "పుచ్చుకోండి నీరు వెచ్చగా ఉన్నాయి. దాహంతీరదు" అన్నాను. "అయ్యో!చాలా శ్రమపడ్డారే" అని. సోడా తీసుకొన్నది. ఏదో పరోపకారంచేస్తున్నానని నాకు నేను సమాధానం చెప్పుకొని, "అ, ఏమిశ్రమలెండి" అన్నాను; ఏదో సామాన్యంగా అట్లా స్నేహితులకూ, పరిచయులకూ నిత్యం

సోడాలు ఇచ్చే ధనవంతుడిలాగ చూస్తా. ఆమె ఆ గ్లాసులోని అమృతంలాంటి సోడాతాగి చేతిరుమాలుతో తుడుచుకొంటూ కొట్టిగ్లాసు నాకిచ్చింది. నేను అగ్లాసును సోడా విక్రయంచేసినవానికి ఇచ్చేశాను. నాకూ దాహం అవుతున్నది. కాని సోడాపుచ్చుకొంటే డబ్బు అయిపోతుందని ఆపేక్షిస్తే కాసిని త్రాగి మళ్ళీ యథాస్థానంలో కూర్చున్నాను. బండి కదిలింది. ఆవిడతో పరిచయం కలిగినందుకు నాలో నేను సంతోషించాను. ఆవిడను ఎన్నో ప్రశ్నలు అడుగుదామనుకొన్నా. కాని ఆవిడ అడిగిన ప్రశ్నకల్లా క్లుప్తమైన జవాబు చెప్పటం, కొన్నిప్రశ్నలకు జవాబే చెప్పక చిరునవ్వు నవ్వి ఊరుకోవటం నా కంతప్రోత్సాహకరంగా ఉండలేదు. కాని ఆమె కళ్ళు మహాచెడ్డవి. అవి నన్ను లెక్కలేనన్ని ప్రశ్నలు వేసినవి దారిపొడుగునా, నా కళ్ళు ఆ ప్రశ్నల కన్నింటికీ సావధానంగా జవాబు చెప్పినవి. ఇంతలోకే బెజవాడ వచ్చాము.

స్టేషనులో రైలు దిగాము. తెనాలివెళ్ళే మెయిలుకు ఇంకా గంటన్నర టైముంది. అక్కడే కూర్చుందాం అన్నాను. ప్లాటుఫారంమీద కూర్చుంటే వచ్చిపొయ్యే వాళ్ళు ఎగాదిగా చూస్తారండీ. వెయిటింగురూములో నన్ను కూర్చోపెట్టండి అని ఆమె వినయంగా కోరింది. అల్లా స్త్రీ కోరుతుంటే ఎవ్వరు కాదనగలరు?

ఆవిడవద్ద రెండుపెట్టెలు ఒకపరుపుచుట్టా ఉన్నవి. అవి వెయిటింగురూముకు చేరాలి కూలీ మూడుపావలాలకు తక్కువైతే వాటిని ముట్టుకోనన్నాడు. అన్నా వాడు చక్కాపోక అక్కడే నిలవబడి వచ్చినవాడిలో నల్లా నేను మూడుపావలాలియ్యమన్నారా, అయ్యగారు సందేహిస్తున్నారు అనటం మొదలు పెట్టాడు, అకొత్తగావచ్చినవాడు ఇచ్చేసేయండి బాబూ, అంతకు తక్కువ కెవ్వరూరారు అని సిఫార్సుచేసి పోవటం నాకేం తోచిందికాదు. ఇంతలో ఆవిడ ఒక పెట్టె నెత్తుకొని పెడదాంరండి అన్నది. మొగవాణ్ని దగ్గర ఉండి కూడా సుకుమారిచేత పెట్టెమోయించటం అనుచితము అనితోచి "మీరెందుకూ? నే పట్టుకొస్తాను ఇల్లా ఇవ్వండి" అని, ఆవిడ రెండుపెట్టెలూ నాలుగానపెట్టు కొని నాపెట్టె చేతోపట్టుకొని ఫర్లాంగుదూరంలో ఉన్న వెయిటింగురూముచేరేసరికి బుజాలు పీక్కొనిపోయినాయి. నడుము కలకబారి నొప్పెట్టింది. ఎప్పుడూ ఒకచిన్న సూట్ కేసయినా మోసిఎరగనివాడను. వెయిటింగురూములో ఆవిడను కూర్చోపెట్టాను. మూడవతరగతి ప్రయాణీకులు అక్కడ కూర్చోకూడదు. కాని అక్కడ ఉండే మనిషికి ఒక హావలాయిచ్చి సంతోషపరిచాను. చాలాఘనకార్యంచేశాను. ఇంత కష్టపడ్డా, ఆవిడ వెయిటింగురూములోపల నేను బయటా? అని కష్టమేసింది మనస్సులో.

నడుములు విరిగిపోతుంటే బయట ఉక్కతినశిలల పైన నడుమువాల్చి లోపలఆవిడ నేను చేసిన ఏర్పాటుకు ఫలితంగా సోఫాలో, ఎలక్ట్రిక్ ఫాన్ క్రింద పడుకోటం చూశాను. నేను వెర్రివాడిని అయినానా ఏమిటి? ఎవరివో ఒక ఆవిడ పెట్టెలు మోయటమేమిటి! ఈకర్మం ఏమిటి! అని అనుకొన్నాను. ఇంతలో ఆమె నొసలూ, కళ్ళూ, పెదవులూ నా ఎదుట నిలువబడి, అల్లా అనుకోక. ఎంత సరదా! అన్నయి. ఎట్లాయితేనేం మళ్ళీ ఆ ఊహే రాలేదు.

ఆకలి అవుతున్నది, హోటలుకు వెళ్ళి రెండు మెతుకులు తినకపోతే బ్రతికేటట్లులేదు. వెంటనేవెళ్ళి భోజనంచేశాను. నేను భోజనంచేసి ఆవిడకు తీసుకొనిపోకపోతే మర్యాదకాదని తోచింది అందుకని టిఫిన్ కారియర్ లో భోజనం పెట్టించుకొని ఆవిడకోసం తీసికెళ్ళాను. ఆవిడ "అయ్యో, ఎంతశ్రమపడ్డారండీ" అని అంటూ కారియర్ అందుకొని అక్కడే పెట్టుకొని భోజనంచేసింది. కావలసినన్నీ అవీ నేనే తెచ్చి ఇచ్చాను. అటుతరువాత ఆగిన్నెలుకడిగి హోటలు వాడికి ఇచ్చేసినాను. నాకర్మంకాలితే ఎంగిలిగిన్నెలు కూడా కడిగాను! అయితే ఇదంతా రొమాన్సు గాలం స్త్రీ అనే పదాలలో శరణ్యంపుచ్చుకొని అంత అసహ్యం అనిపించవు.

భోజనానంతరం ఆవిడ ఏమిటో చేతిలోకి తీసికొని నావంకతిరిగి "ఇదిగో తీసికోండి" అనినట్లు సంజ్ఞ చేసింది. పోకచెక్కో ఏమిటో ఇయ్యవస్తున్నదనుకొని

అసలావిశేషలవంటి మెత్తనిచేతులు తగలటంవల్ల కలిగే స్పర్శసౌఖ్యం ఊహించుకొని ఆనందంతో చెయ్యి జాపాను. ఆమె తనచేతిని నాచేతికి తాకనియ్యకుండా, తాకితే ఎలక్ట్రిక్ షాక్ తగిలి చచ్చిపోతాననుకొందో ఏమోమరి ఎత్తి నాచేతిలో పడేసింది రాగిడబ్బు ఒకటి; "కిళ్లీ కొనుక్కోండి" అన్నది నవ్వుతూ! నాకు అరికాలుమంట నెత్తికెక్కింది. ఇందాకటినుంచీ సోఫాకు, భోజనానికి డబ్బు ఖర్చుపెడుతూ అడ్డమైన చాకిరీ చేస్తుంటే విశ్వాసంలేకుండా కిళ్లీకని ఒకరాగిడబ్బు ఎత్తి చేతిలో వేస్తుందా! అదీ ఒక్క కిళ్లీకా? అని ఉక్రోషంవచ్చింది.

నాముఖంలో ఉండే కవళికలు తెలియజేసే భావాలను ఆమె గ్రహించింది. ఒక్కనవ్వు నవ్వింది. మచ్చుమందు చల్లినట్లయింది! మళ్ళీ మాట్లాడకుండా, ఆ కానీ ఆమెచేతిలోకి గిరాటుపెట్టి, కిళ్లీదుకాణం దగ్గరకెళ్ళి అర్ధణా, అర్ధణా కిళ్లీలు మాంచి సుగంధవస్తువులతో కూరినవి రెండు కట్టించుకొనివచ్చి ఒకటి ఆమెకుచూపి ఇస్తాను రమ్మని పిలిచాను. ఆమె అక్కడికే గిరాటు వెయ్యమని సంజ్ఞ చేసింది కోపంతో విసిరాను ఆమెపైకి. ఆమె నవ్వుతూనే, తీసుకొని ఊరుకొన్నది.

మళ్ళీ రైలుబైలు అయింది. తెనాలిపైపునకు వెళ్ళే మెయిలు వచ్చింది. మళ్ళీ ఆవిడపెట్టెలను రైలుపెట్టెలోకి తోశాను. ఇద్దరం ఒకపెట్టెలోనే ఎక్కాము. ఆవిడప్రక్కనే కూర్చున్నాను. ఇంత అవస్థపడ్డందుకు ఆవిడ నామీద కృతజ్ఞురాలైయుంటుందనుకొని ఏమిటో మాట్లాడాలని ఆవిడకు దగ్గరగా జరిగాను. కుచ్చెళ్ళచెరగులు దగ్గరకు లాక్కొని, ఒదుక్కొని "చూడండీ కొంచెందూరంగా కూర్చోండి" అన్నది మెల్లగాసన్ననిగొంతుకతో రెండోవాడికి వినపడకుండా. దానితో నాప్రాణాలు చల్లబడ్డవి. నేనెందుకు నాగౌరవాన్ని చంపుకొని ఈవిడకు అరవచాకిరీ చేస్తున్నానా అని విచారంకలిగింది.

తెనాలిస్టేషను వచ్చింది. నేనుదిగి నాపెట్టె దింపుకొని ఆమెకేసిచూస్తూ "దిగరేం" అన్నాను. "ఇక్కడకాదు లెండి నేను దిగటం" అన్నది. ఆమాట వినేసరికి నాపైన పిడుగుపడ్డట్లయింది. తక్షణం నాపెట్టెను చేత్తోపట్టుకొని వెళ్ళిపోతూ ఆవిడవంక తిరిగి ఉక్రోషం పట్టలేక కసిఅంతా తీరేటట్లుగా వెక్కిరింతగా నానా వికారపుచేష్టలూచేసి బైటకు వినపడకుండా తిట్టుకొన్నాను. ఆవిడ ఏమో అనొస్తుంటే వినిపించలేదు. ఆవిడ పకాపకా నవ్వింది.

డబ్బులంతా ఖర్చు ఆయిపోయింది. పెట్టెను మోయటానికి కూలీని పెట్టుకొందామన్నా దమ్మిడీలేదు. బండి కట్టించుకోటానికి అసలే లేదుగదా! పోనీ ఇంటివద్ద మావాళ్ళనుఅడిగి ఇవ్వకూడదా అనుకొంటే వెళ్ళేది అత్తవారింటికి. వెళ్ళటం వెళ్ళటం అర్ధణా డబ్బులు అప్పు అడగటంకంటె చండాలప్పని ఇంకేముంది. ఆపెట్టె నెత్తినేసుకొన్నాను. ఇంటిదారిపట్టాను.

బెజవాడ స్టేషనులో పెట్టెను మోయటంచేత, భుజాలు, నడుమూ పీక్కుపోతున్నది. శ్రీరామమూర్తి జ్ఞాపకానికి వచ్చాడు. రామస్మరణ చేయాలనుకొన్నాను. కాని ఆ నొసలూ, ఆకళ్ళూ, ఆఎర్రని పెదిమలూ తొంగిచూస్తున్న నవ్వు, నాఎదుట ప్రత్యక్షమై నన్ను చూసి వెక్కిరించటం మొదలు పెట్టినవి. రామస్మరణ ఎట్లా సాగుతుంది?

మునిమాణిక్యం నరసింహారావు

